క్లుప్తంగా

కురుమ, కురుబలను ఎస్టీ జాబితాలో చేర్చండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కురుబ, కురుమ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ సంఘం నేతలు కోరారు. బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సిత్ర సత్యనారాయణమ్మ, మదాసి కురువ, మదారి కురువ సంఘం సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ తదితరులు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి అభినందనలతో పాటు వినతిపత్రాన్ని అందజేశారు. మదాసి,మదారి కురువ కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 53ను జారీ చేసిందన్నారు. ఈ జీవో ఆర్‌డీఓ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు అమలయ్యేలా చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలసినవారిలో ఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.రవికుమార్, సుంకన్న, వెంకటకృష్ణ, యుగంధర్, సురేంద్ర తదితరులు ఉన్నారు.

ఎండోక్రైనాలజీకి పీజీ సీట్లు రావడం అభినందనీయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగానికి రెండు పీజీ సీట్లను నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేయడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆయన ఛాంబర్‌లో ఎండోక్రైనాలజీ విభాగం వైద్యులు డాక్టర్ పి.శ్రీనివాసులు, డాక్టర్ రాధారాణిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా ఎండోక్రైనాలజీ విభాగం ద్వారా రోగులకు మంచి వైద్యసేవలు అందుతున్నాయని, పీజీ సీట్లు రావడం వల్ల మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉందన్నారు.

జీజీహెచ్‌కు జనవిజ్ఞాన వేదిక సాయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే పేద రోగుల కోసం జనవిజ్ఞాన వేదిక తరుపున అవసరమైన సాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి చెప్పారు.బుధవారం ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డిని కలిసి వివరాలు వెల్లడించారు. ఆసుపత్రికి ఎంతోమంది పేదరోగులు చికిత్స కోసమై వస్తుంటారని, వారికి అవసరమైన పరికరాలు, వస్తువులు విరాళంగా ఇస్తామని చెప్పారు. ఈ మేరకు వివరాలు ఇవ్వాలని కోరారు. దీంతో పాటు ఆసుపత్రిలో నిహాస్‌సర్జన్లకు అవసరమైన శిక్షణ కూడా జేవీవీ అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకరరెడ్డి, జేవీవీ సభ్యులు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీని ఎంపీ పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా 15వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి సీపీఎం, సీపీఐ, వాటి అనుబంధ సంఘాల నాయకులు హాజరు కానున్నట్లు చెప్పారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. స్థానిక కొత్తపేటలోని సుల్తానియా మసీదులో బుధవారం ఏర్పాటు చేసిన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఖైసర్, ఫహీం, నూర్ అహ్మద్, జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డీఐజీ అభినందన

కర్నూలు: కర్నూలు నగరంలోని సైనిక్ స్కూల్, ఆర్ఐఎంసీ, ఆర్ఎంసీ, నవోదయ ప్రవేశ పరీక్ష 2023–24లో జనార్ధన్స్ విన్నర్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించి ఉత్తమ ప్రతిభను కనపరిచారు. దీంతో వారిని డీఐజీ సెంథిల్‌కుమార్ గురువారం తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. 6వ తరగతి విభాగంలో కె.శాశ్వత్, వై.కీర్తిక రెడ్డి, డి.రోహిత్, 9వ తరగతి విభాగంలో వై.హేమంత్, చక్రధర్ రెడ్డి ప్రతిభ కనపరచి సైనిక్ స్కూల్‌లో ప్రవేశ అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్స్ విన్నర్స్ అకాడమి డైరెక్టర్ తోట జనార్ధన్, టి.శ్రవణ్ తదితరులు ఉన్నారు.

41 మందికి ఉద్యోగాలు

కర్నూలు(సెంట్రల్): మైపర్ ఫార్మసీ క్యాంపస్ డ్రైవ్‌లో 41 మంది ఉద్యోగాలు సాధించారు. బుధవారం హెటిరో ల్యాబ్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో వారికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. ఇందులో 21 మంది కర్నూలులోని మైపర్ ఫార్మసీకి చెందిన విద్యార్థులు ఉండడం విశేషం.

టాటూ ట్రెండ్!



టాటూ డిజైన్లు





- సరికొత్తగా పచ్చబొట్టు డిజైన్లు
- ఆసక్తి చూపుతున్న యువత
- త్రీడీ, ఎంబ్రాయిడరీ టాటూలకు భలే డిమాండ్



టాటూ వేస్తున్న దృశ్యం

కర్నూలుకల్చరల్: ప్రస్తుతం టాటూ ట్రెండ్‌గా మారింది. అందం, ఆకర్షణీయం కోసమంటూ యువత టాటూ(పచ్చబొట్లు) వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు పెద్దపెద్ద నగరాల్లో మాత్రమే కనిపించిన ఈ కల్చర్ నేడు పట్టణాలకు పాకింది. మొదట్లో ఇష్టమైన వారి పేర్లనూ, దేవుడి బొమ్మల్నీ, ఇతర గుర్తుల్నీ టాటూ వేయించుకునే వారు. ఇప్పుడు ట్రెండ్‌కు తగట్టు రకరకాల నూతన డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. సింపుల్ టాటూ నుంచి పరమనెంట్ టాటూ,టెంపరరీ టాటూ, త్రీడీ టాటూ, ఫేస్ టాటూ, కలర్ టాటూ, కస్టమైజ్ టాటూ, ఎంబ్రాయిడరీ టాటూలు ఇలా అనేక విధాలుగా వస్తుండటంతో యువతకు మరింత క్రేజీగా మారింది. వీటిల్లో త్రీడీ, ఎంబ్రాయిడరీ టాటూలకు భలే డిమాండ్ ఉంది.

సంప్రదాయ బద్ధంగా...

ఎంబ్రాయిడరీ టాటూలు ఎక్కువగా దుస్తుల మీద వేసే కుట్టుపూల డిజైన్లనే ఎంచుకుంటారు. దీంతో ఇవి అటు సంప్రదాయ బద్ధంగానూ ఇటు విభిన్నంగానూ ఉంటున్నాయి. ఎంబ్రాయిడరీ టాటూలను వేసేటపుడు సూదిని ప్రత్యేకమైన శైలిలో గుచ్చి ఆ చారికలు అల్లిన దారం ఆకారంలో పడేలా చేస్తారు. దీంతోపాటుగా మొత్తం పచ్చ బొట్టు త్రీడీ టాటూలా ఉబ్బెత్తుగా కనిపించేలా వేస్తారు. అలా ఈ టాటూలను చూస్తే నిజంగానే ఒంటి మీద ఎంబ్రాయిడరీ వేశారా అనిపిస్తుంది. పువ్వులూ, సీతకోక చిలుకలూ, మిక్కీమౌస్, కార్టూన్ బొమ్మలు కాల్పనిక కథా చిత్రాల్ని కూడా అందంగా ఒంటి మీదవేస్తున్నారు. చూడ్డానికి భలే ఉన్న ఈ టాటూలూ ఇప్పుడు హాట్‌ఫ్యాషన్‌గా మారి అబ్బాయిలు, అమ్మాయిల చేతులు, భుజాల మీది కెక్కి కూర్చుంటున్నాయి.

ప్రత్యేక శిక్షణ పొంది..

టాటూ ఎలా వేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి లాంటి వాటిని తెలుసుకునేందుకు డిజైనర్లు ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, చెన్నైలలో ప్రత్యేక శిక్షణ పొందారు. కర్నూలు నగరంలో ఓల్డ్‌సిటీలోని ఉజాలా గిఫ్ట్ ఆర్టికల్స్ యజమాని హితేష్ జైన్ ఎనిమిది సంవత్సరాల క్రితం మొట్ట మొదట జిల్లాకు టాటూలను పరిచయం చేశారు. ప్రస్తుతం నగరంలో నాలుగు చోట్ల టాటూలు వేసే కేంద్రాలు వెలిశాయి. నంద్యాల, ఆదోని, డోన్ పట్టణాలకు సైతం టాటూ కల్చర్ పరిచయమైంది. ఒక ఇంచ్ రూ.300తో ప్రారంభమై డిజైన్, సైజ్, వర్క్‌ను బట్టి రూ.లక్ష వరకు ధర ఉంటుందని డిజైనర్లు చెబుతున్నారు.

టాటూలపై ఆసక్తి పెరిగింది

టాటూలు వేసుకోవడంపై ప్రతి ఒక్కరికీ ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు పచ్చబొట్టు చేతిపై వేయించుకోవడం సాధారణంగా ఉండేది. కాలానుగుణంగా క్రీడాకారులు, యువకులు, సినీ తారలు వీటిపై ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. వారిని అనుసరిస్తూ అన్ని వర్గాల వారు, అన్ని వయసుల వారు టాటూలు వేయించుకుంటున్నారు.

– హితేష్ జైన్

అన్నయ్య జ్ఞాపకార్థం



మా అన్న ఈశ్వరయ్య జ్ఞాపకార్థం ఈశ్వరుని టాటూను వేయించుకున్నాను. సంవత్సరం ఆరునెలల క్రితం కేరళలో రోడ్డు ప్రమాదంలో మా అన్న ఈశ్వరయ్య మరణించారు. ఫ్రెండ్‌లా ఉన్న అన్నయ్య దూరం కావడంతో మా ఇష్టదైవం మల్లికార్జునుడు, అన్న ఈశ్వరయ్య పేరు కలిసి వచ్చేలా పరమనెంట్ టాటూ వేయించుకున్నాను.

– ప్రేమ్, వ్యాపారి, కర్నూలు

మాతామరణాలు జరగకుండా చూడాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతామరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో మాతృమరణాలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కౌతాళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గౌడూరు గ్రామంలో గత మార్చిలో సంభవించిన మాతృమరణంపై ఆయన సమీక్ష చేశారు. కార్డియాక్ పల్మనరీ అరెస్ట్ కారణంతో మరణం జరిగిందని కమిటీ నిర్ధారించింది. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భవతులను తొందరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. సమావేశంలో గైనకాలజి హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.వెంకటరమణ, డీఐవో డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ శ్రీధర్‌శర్మ, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుధీర్‌కుమార్, డీపీహెచ్‌ఎన్‌వో లిన్నెట్ లిడియా పాల్గొన్నారు.

16న ఉచిత వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. నీటి పారుదల శాఖ విశ్రాంత డీఈ గురిజాల విశ్వనాథం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో డాక్టర్ మధుబాబు షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేస్తారన్నారు. లలితా పీఠం సభ్యులు, భక్తులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కర్నూలు జిల్లా నూతన ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం మర్యాదపూర్వకంగా లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డిని, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ సీతారామమూర్తిని, కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేశారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు



బీసీ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో బీసీ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే సర్కిల్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. బీసీ సంఘాల నాయకులు విన్నవించిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రామకృష్ణ, అనిల్‌కుమార్, శేషఫణి, హేమంత్ గౌడ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పద్య నాటక విజేతలకు సన్మానం

కర్నూలు కల్చరల్: జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో విజేతలైన టీజీవీ కళాక్షేత్రం కళాకారులను బుధవారం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆయన ఛాంబర్‌లో సన్మానించి అభినందించారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక ఆధ్వర్యంలో మిర్యాలగూడలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన పద్యనాటకం 'శ్రీకృష్ణ కమల పాలిక' ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో పాటు ఉత్తమ నటుడుగా శ్రీకృష్ణ పాత్రదారి జి.శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటిగా కమలపాలిక పాత్రదారి సురభి ప్రభావతి, ఉత్తమ హాస్యనటుడుగా చిట్టిదొర పాత్రదారి సంగా ఆంజనేయులు, ఉత్తమ హాస్య నటిగా సింగారి పాత్రదారి హసీనా, ఉత్తమ సంగీతం హార్మోనిస్టు బి.బలరాముడు బహుమతులను అందుకున్నారు. ప్రముఖ నాటక రచయిత పల్లేటి కులశేఖర్ నాటక రచన చేయగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించారు. ప్రతిభ కనబరిచిన కళాకారులను అభినందించిన టీజీ ముందు ముందు మరిన్ని అవార్డులను సాధించాలని సూచించారు.

ఏసీల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి స్పాట్ వాల్యుయేషన్ అసిస్టెంట్ ఎగ్జామినర్ల(ఏసీ)ల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని డీఈఓ రంగారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏసీల సీనియారిటీ జాబితాను బ్లాగ్ స్పాట్ కర్నూలు డీఈఓ13 అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. కాగా, స్పాట్‌వాల్యుయేషన్ ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు జిల్లాకేంద్రంలో జరుగుతుందని ఆయన వివరించారు.

జిల్లాకు మహిళా ఐఏఎస్‌లు రావడం హర్షణీయం



జిల్లా కలెక్టర్ సృజనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎన్జీవో నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా కలెక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలను ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి నేతృత్వంలో కలెక్టర్, జేసీలను వారి చాంబర్లలో కలసి పుష్పగుచ్ఛాలు బహూకరించారు. మహిళా ఐఏఎస్ అధికారులు జిల్లాకు కలెక్టర్, జేసీగా రావడం హర్షణీయమని వెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ సృజన మాట్లాడుతూ జిల్లా పరిపాలనలో ప్రతి ఒక్కరూ కీలకమేనని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల అమలుకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్ లాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, పాండురంగారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూమి కొనుగోలులో అక్రమాలను నిగ్గు తేల్చండి

కర్నూలు(అర్బన్): జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న భూమి కొనుగోలు పథకంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసారపు వెంకటేష్ కోరారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'పథకం పారి... చేతులు తడిసి' అనే కథనంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆయన పత్రికా ప్రతితో పాటు వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను బుధవారం కలసి అందజేశారు. ఆదోని మండలం చిన్నగోనేహాల్ గ్రామంలో 29.53 ఎకరాలు, చిన్న హరివనం గ్రామంలో 47.99 ఎకరాలను ఆయా గ్రామాల్లో ఎంపికైన ఎస్సీ లబ్ధిదారులకు భూమి కొనుగోలు పథకం ద్వారా అందజేయాల్సి ఉందన్నారు. అయితే ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, రైతులు కుమ్మక్కై అధిక ధరలకు వ్యవసాయానికి పనికిరాని భూమిని కొనుగోలు చేశారన్నారు. ఎస్సీ మహిళా లబ్ధిదారులకు భూములు ఇవ్వకుండా దాదాపు 5 సంవత్సరాలు కాలయాపన చేస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని వ్యవసాయానికి యోగ్యమైన భూములను పేద ఎస్సీలకు అందించాలని కోరారు. కలెక్టర్‌ను కలసినవారిలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప కూడా ఉన్నారు.

అందరి సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 29వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు'



శరీన్‌నగర్‌లో లబ్ధిదారుడికి పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 29వ వార్డు శరీన్‌నగర్‌లో కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజలకు చేసిన మంచిని వివరించడమే కార్యక్రమంఉద్దేశమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద తల్లిదండ్రులు పిల్లల చదువులకు ఇబ్బందులు పడకుండనే అమ్మ ఒడి, జగనన్న వసతి దీవేన, విద్యా దీవేన, జగనన్న విద్యా కానుక, గోరు ముద్ద పథకాలను అందిస్తున్నామన్నారు.రాబోయే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, తిరుమలేష్ గౌడ్,శివారెడ్డి,నాగేశ్వరరెడ్డితదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల స్థలాల్లో మట్టి తవ్వకాలను నిరోధించాలి

కర్నూలు(సెంట్రల్): జగన్నాథగట్టులోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల్లో అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం మట్టి తవ్వకాలు జరుగుతున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మట్టిమాఫియా కట్టడికి అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఇప్పటికే జర్నలిస్టులు పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినామట్టి తవ్వకాలు మాత్రం ఆగడంలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీ నారాయణ, రాజశేఖర్, రాముడు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

18న చిత్రలేఖన పోటీలు

కర్నూలు కల్చరల్: భారత ప్రభుత్వ పృథ్వీ విజ్ఞాన మంత్రిత్వశాఖ, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. 2023 ధరిత్రి దినోత్సవ ప్రచార అంశం అయిన 'ఇన్వెస్ట్ ఇన్ అవర్ ప్లానెట్ 'పై సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. వీఆర్ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 93968 61308 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డెయిరీ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

కర్నూలు(అగ్రికల్చర్): విజయ డెయిరీలో పనిచేసే ఉద్యోగులు, పాల ఉత్పత్తిదారుల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నట్లుగా విజయ డెయిరీ కర్నూలు మేనేజర్ ఎస్.విజయకుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ప్రక్కన ఉన్న డెయిరీలో చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ హోమియో కేర్ వైద్యులు ప్రశాంత్ మాట్లాడుతూ...హోమియోలో అన్ని వ్యాధులకు చక్కటి వైద్యం లభిస్తోందన్నారు. అనంతరం 50 మంది డెయిరీ ఉద్యోగులు, కార్మికులకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ లింగస్వామి, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ప్రచార భేరీ

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 14నుంచి 30వ తేదీ వరకు చేపట్టే ప్రచారభేరీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి ప్రారంభిస్తామని సీపీఐ, సీపీఐ నగర కార్యదర్శులు ఎం.రాజశేఖర్, టి.రాముడు, పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..14వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి రెండు బృందాలుగా ఏర్పడి నగరంలోని ఇంటింటా పర్యటించి ప్రజలకు మోదీ వ్యతిరేక విధానాలను తెలియజేస్తామని వివరించారు.

నూతన ఎస్పీకి శుభాకాంక్షలు



ఎస్పీని కలిసిన పోలీసు సంఘం ప్రతినిధులు

కర్నూలు: కర్నూలు జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జి.కృష్ణకాంత్‌ను పోలీసు అధికారుల సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం మధ్యాహ్నం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఖాజాబంద, కార్యవర్గ సభ్యులు ఎ.వెంకటేశ్వరరావు, మల్లికార్జున, పోలీస్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు రఘురాముడు తదితరులు ఎస్పీని ఛాంబర్‌లో కలసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

తొలగించాల్సిన కాళ్లను కాపాడారు

- కామినేని ఆసుపత్రిలో అరుదైన చికిత్స



ఆపరేషన్ చేయించుకున్న తిరుపతయ్యతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): ఓ ప్రమాదంలో రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయి వాటిని తీసివేయాల్సిన పరిస్థితి వచ్చిన ఓ వ్యక్తికి వైద్యులు ఆపరేషన్ ద్వారా కాళ్లను కాపాడారు. వివరాలను బుధవారం కర్నూలులోని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవిబాబు వివరించారు. ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన తిరుపతయ్య(32) ఓ హార్టికల్చర్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 9న కంపోస్టును తయారు చేస్తుండగా ప్రమాదశాత్తూ యంత్రం స్టార్ట్ అయి దానికి 1500 కిలోల బరువున్న స్పిన్నర్ తిరుగుతూ వచ్చి ఆయన రెండు కాళ్లకు బలంగా తాకాయి. దీంతో అతని రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అతన్ని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌కు తీసుకురావడంతో ఆపరేషన్ నిర్వహించారు. థ్రోంబెక్టమి, దమనుల మరమ్మతుతో పాటు బాహ్య ఫిక్సేటర్‌తో ఎముక స్థిరీకరణ, కుడి దిగువ అవయవానికి గాయం మూసివేసినట్లు డాక్టర్ రవిబాబు తెలిపారు. ఆరు గంటల పాటు నిర్వహించిన ఆపరేషన్‌లో తనతో పాటు వాస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, అనెస్తెటిస్ట్ డాక్టర్ ఆదిత్య, ఎమర్జెన్సీ హెచ్‌వోడీ డాక్టర్ రామమోహన్‌రెడ్డి పాల్గొన్నట్లు వివరించారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నాడని, వీల్‌చైర్‌లో తిరుగుతున్నాడని చెప్పారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఏపీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవై కృష్ణ, జిల్లా చైర్మన్ వి.గిరికుమార్ హెచ్చరించారు. బుధవారం ఏపీజేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ..ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఈహెచ్‌ఎస్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు శంకరప్ప, గిడ్డయ్య, సూరిబాబు, ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

కర్నూలు: పీపుల్స్ హెల్త్ సొసైటీ, అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం (నేడు)కర్నూలులోని బిర్లాగేట్ దగ్గర ఉన్న కృష్ణకాంత్ ప్లాజాలోని బ్రహ్మారెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీపుల్స్ హెల్త్ సొసైటీ జిల్లా కన్వీనర్ సుజాత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్, ఐటీఐ పాస్/ఫెయిల్ (ఏ ట్రేడ్ అయినా) 18 నుంచి 25 సంవత్సరాలు వయస్సు లోపువారు జాబ్ మేళాకు అర్హులన్నారు. వివరాల కోసం 91004 77371, 91777 70090 నంబర్లను సంప్రదించాలని సూచించారు.